# ఎంపీ ల్యాడ్స్ సొంతానికి వాడుకున్నా

**సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన బీజేపీ ఎంపీ సోయం బాపురావ్ వ్యాఖ్యలు**

ఆదిలాబాద్, జూన్ 19 (నమస్తేతెలంగాణ): ఎంపీ ల్యాడ్స్ తన సొంత అవసరాలకు వినియోగించుకున్నానంటూ ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ సోయం బాపురావ్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఎంపీగా తనకు సొంత ఇల్లు లేకుంటే విలువ ఉండదని, దీంతోపాటు కుమారుడి వివాహానికి ఎంపీ ల్యాడ్స్ వాడుకున్నానని తెలిపారు. ఏ నాయకుడు కూడా ఈ మాటను ఒప్పుకోడని తాను ఒప్పుకొంటున్నానని చెప్పారు. ఆదిలాబాద్‌లో ఇటీవల జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తున్నది. అయితే, తాను వాడుకున్న ప్రతి పైసాను తిరిగి లబ్ధిదారులకు ఇచ్చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఎంపీ సోయం బాపురావ్ ఎంపీ ల్యాడ్స్ నిధులను సొంత పనుల కోసం వాడుకోవడంపై ప్రతిపక్షాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ వ్యాఖ్యలపై నెటిజన్స్ మండిపడుతున్నారు. ప్రజల అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన నిధులను తన సొంతానికి వాడుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

**నన్ను పక్కకు తప్పించే ప్రయత్నాలు: బాపురావ్**

తాను చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడం, ప్రతిపక్షాలు విమర్శలకు దిగిన నేపథ్యంలో సోయం బాపురావ్ మరో వివరణ ఇచ్చారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, మీడియాలో తప్పుడు కథనాలు రాయిస్తున్నారని వాపోయారు. తాను ముక్కుసూటిగా ఉండటం కొందరు బీజేపీ నాయకులకు నచ్చడం లేదని, తనను పార్టీలో నుంచి తప్పించడానికి ఈ ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఎంపీ నిధులు ఏ మాత్రం దుర్వినియోగం కాలేదని, తన సొంత ఇంటి నిర్మాణం, కుమారుడి వివాహం సందర్భంగా బిజీగా ఉండటంతో ఎంపీ ల్యాడ్స్ పనులు కార్యకర్తలకు ఇవ్వలేక పోయానంటూ చెప్పుకొచ్చారు.

# జానారెడ్డికి సొంతూరు ప్రజల షాక్



జానారెడ్డి సొంతూరైన అనుముల గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

- **బీఆర్‌ఎస్‌లో చేరిన 40 కాంగ్రెస్ కుటుంబాలు**

హాలియా, జూన్ 19: 'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తది. అవకాశం వస్తే నేనే రాష్ట్రానికి ముఖ్యమంత్రినైతా' అని పగటి కలలు కంటున్న మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డికి సోమవారం సొంతూరు ప్రజలు షాక్ ఇచ్చారు. 40 ఏండ్లుగా జానారెడ్డి రాజకీయ ఎదుగుదలకు ఎంతో అండగా ఉన్న అనుముల గ్రామ ప్రజలు.. హాలియా మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులయ్యారు. ఈ మేరకు జానారెడ్డి సొంతూరుకు చెందిన 40 కాంగ్రెస్ కుటుంబాలు ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరాయి. ఎమ్మెల్యే భగత్ మాట్లాడుతూ.. 2018కి ముందు నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఎన్నికలు జరిగిన ప్రతిసారి జానారెడ్డి రిగ్గింగ్‌తో గెలిచారే తప్ప ప్రజాబలంతో కాదని ఆరోపించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కే వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## నా జోలికొస్తే చంపుత బిడ్డా

- *ఫార్మసిస్ట్ శివకుమార్‌కు కాంగ్రెస్ నేత ఐలయ్య హెచ్చరిక*
- *రాచకొండ పోలీసులకు వాట్సాప్‌లో బాధితుడి ఫిర్యాదు*

*రాజాపేట, జూన్ 19: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ప్రభుత్వ దవాఖానలో ఫార్మసిస్ట్‌గా పని చేస్తున్న చిమ్మి శివకుమార్‌ను కాంగ్రెస్ పార్టీ ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బీర్ల ఐలయ్య ఫోన్‌లో తీవ్రంగా బెదిరించాడు. 'నా జోలికి వస్తే చంపుత బిడ్డా' అంటూ భయభ్రాంతులకు గురిచేశాడు. అందుకు సంబంధించిన ఆడియో సోమవారం స్థానిక సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బీర్ల ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ప్రైవేట్ అంబులెన్స్.. కార్పొరేట్ దవాఖానలతో కలిసి చేస్తున్న కమీషన్ల బాగోతంపై రాజాపేట మండలంలోని దూదివెంకటాపురం గ్రామానికి చెందిన శివకుమార్ ఫోన్‌లో బీర్ల ఐలయ్యను ప్రశ్నించాడు. దాంతో ఐలయ్య శివకుమార్‌ను అడ్డగోలుగా దూషించాడు. 'అరేయ్.. నేను ఎవరిని అనుకుంటున్నవ్ రా.. నాకు ఎంత మంది పెద్దల అండ ఉందో తెలుసారా.. నీ బతుకు ఎంత, నువ్వెంత.. నేను తలుచుకుంటే నువ్వు బతుకలేవు బిడ్డా.. ఖబడ్దార్.. ఇంటికి వచ్చానంటే ఖతం అయితవ్ బిడ్డా.. నాకు ఫోన్ చేసే అంతటి వాడివారా.. నేను ఆలేరుకు కాబోయే నాయకుడిని బిడ్డా.. నా జోలికి వస్తే నీ అంతు చూస్తా' అంటూ తీవ్రంగా దూషించాడు. బీర్ల ఐలయ్యపై చర్యలు తీసుకోవాలని బాధితుడు శివకుమార్ రాచకొండ పోలీసులకు వాట్సాప్‌లో ఫిర్యాదు చేశాడు.*

## సాగునీటి కేటాయింపులకు గ్రీన్‌సిగ్నల్

తుంగభద్ర బోర్డు సమావేశంలో నిర్ణయం

అయిజ, జూన్ 19: తుంగభద్ర నదీపరీవాహక రాష్ట్రాలకు సాగునీటి కేటాయింపులకు తుంగభద్ర బోర్డు(టీబీ) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ఏడాది రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఆయకట్టుకు 5.374 టీఎంసీలు కేటాయించేందుకు ఓకే చెప్పింది. కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి వచ్చే వరదను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నది. 2023-24 ఏడాదిలో 175 టీఎంసీలు వస్తాయని బోర్డు అధికారులు, ఇంజినీర్లు అంచనా వేశారు. కృష్ణా వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ) కేటాయింపుల మేరకు తెలంగాణ, కర్ణాటక, ఏపీ రాష్ట్రాలకు దామాషా పద్ధతిలో పంపకాలు చేపట్టారు. ఈ నెల 8న కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం అతిథి గృహంలో టీబీ బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి, తెలంగాణ, ఏపీలకు చెందిన ఎస్ఈలు, ఈఈలతో సమావేశం నిర్వహించారు. రెండ్రోజుల కిందట కేటాయింపులపై నిర్ణయం ప్రకటించారు. తుంగభద్ర నదీపరీవాహక రాష్ట్రాలకు కేడబ్ల్యూడీటీ 212 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు అంగీకారం తెలిపింది. కర్ణాటక 138.990, ఏపీ 66.500, ఆర్డీఎస్ 6.510 టీఎంసీల నీటిని వాడుకునేందుకు అవకాశం ఉందని ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.














